# జనరల్ స్టడీస్

## భారతదేశ చరిత్ర

### గాంధీ యుగం

**భారతదేశ చరిత్రలో క్రీ.శ.1919 – 47 మధ్యకాలాన్ని గాంధీ యుగంగా పిలుస్తారు. ఈ కాలంలో గాంధీజీ భారత రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టి తనదైన ముద్రవేశారు.**

గాంధీజీ 1934లో కాంగ్రెస్‌ను వీడినా, మరణించే వరకు కాంగ్రెస్ పార్టీకి స్ఫూర్తిగా నిలిచారు. 1940లో కొంతకాలం కాంగ్రెస్‌కు నాయకత్వం వహించినా మరుసటి సంవత్సరం ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. క్రీ.శ.1942లో క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపు ఇచ్చినప్పటికీ, ఉద్యమాన్ని ప్రారంభించేలోపు బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని జైల్లో పెట్టింది.

భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో కీలక భూమిక పోషించి జాతిపితగా ప్రసిద్ధికెక్కిన గాంధీజీ గుజరాత్‌లోని కథియవార్ సంస్థానంలో పోర్‌బందర్ అనే గ్రామంలో అక్టోబరు 2, 1869లో జన్మించారు. గాంధీజీ తండ్రి కరమ్ చంద్ పోర్‌బందర్, రాజ్‌కోట్‌లలో దివాన్ (మంత్రి)గా పనిచేసేవారు. గాంధీజీ తల్లి పుత్లీబాయి. గాంధీజీకి 12 ఏళ్ల వయసులో కస్తూర్బాతో వివాహం జరిగింది. గాంధీజీ ఇంగ్లండులో బారిస్టరు చదువు పూర్తి చేసుకుని భారతదేశానికి తిరిగి వచ్చారు. 1893లో దాదా అబ్దుల్లా అనే వ్యక్తి తరపున న్యాయవాదిగా దక్షిణాఫ్రికాకు వెళ్లారు. అక్కడ శ్వేత జాతీయుల దురహంకారం వల్ల భారతీయులు ఎదుర్కొంటున్న అవమానాలను చూసి చలించిపోయారు. గాంధీజీ శ్వేతజాతి ప్రభుత్వంపై పోరాడటానికి సత్యాగ్రహమనే కొత్త ఆయుధాన్ని ఉపయోగించారు. గాంధీజీపై ప్రభావం చూపిన వ్యక్తుల్లో ప్రముఖులు... థోరూ, లియో టాల్‌స్టాయ్, జాన్ రస్కిన్. గాంధీజీ డర్బన్‌లో ఫీనిక్స్ ఫామ్‌ను ఏర్పాటు చేశారు. 1903లో ఇండియన్ ఒపీనియన్ అనే పత్రికను ప్రారంభించారు. 1910లో సత్యాగ్రహంలో పాల్గొనే కుటుంబాలకు అండగా ఉండటానికి టాల్‌స్టాయ్ ఫామ్‌ను ప్రారంభించారు. 1914 వరకు దక్షిణాఫ్రికాలో ఉండి, 1915 జనవరిలో భారత్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి ప్రపంచ యుద్ధంలో గాయపడిన వారికి సేవ చేయడానికి ఇంగ్లండులో అంబులెన్స్ యూనిట్‌ను ఏర్పాటు చేసినందుకు బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని 'కైజర్ ఇ హింద్' అనే బంగారు పతకంతో సత్కరించింది.

#### ఉద్యమాల పరంపర

దక్షిణాఫ్రికాలో గాంధీ ప్రయత్నాల గురించి విద్యావంతులకేగాక, సామాన్య ప్రజలకు కూడా తెలిసింది. దేశంలో సామాన్య ప్రజల పరిస్థితిని తెలుసుకోవడానికి తన రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే స్థాపించిన సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటి సభ్యుడిగా భారత దేశమంతటా పర్యటించారు. బ్రిటన్ మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొంటున్న సమయంలో హోమ్‌రూల్ ఉద్యమం చేయడం మంచిది కాదని భావించారు. జాతీయవాదుల లక్ష్యాలను సాధించడానికి అహింసాయుత సత్యాగ్రహమే సరైన విధానమని పేర్కొన్నారు. 1917 –18 మధ్యకాలంలో మూడు పోరాటాల్లో పాల్గొన్నారు.

**చంపారన్ సత్యాగ్రహం:** బిహార్‌లోని చంపారన్‌లో నీలిమందు రైతులను కష్టాల నుంచి గట్టెక్కించడానికి 1917లో సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. గాంధీజీ సభ్యుడిగా ప్రభుత్వం ఒక విచారణ కమిటీని నియమించింది. విచారణ కమిటీ సిఫార్సుల మేరకు రైతులకు వ్యతిరేకంగా ఉన్న బ్రిటిష్ ప్రభుత్వ విధానాన్ని రద్దు చేశారు. ఇది భారతదేశంలో గాంధీజీకి మొదటి రాజకీయ విజయం.

**అహ్మదాబాద్ మిల్లు సమ్మె:** ప్లేగు బోనస్ నిలుపుదలకు సంబంధించి మిల్లు యజమానులకు, కార్మికులకు మధ్య గొడవ జరిగింది. దీంతో గాంధీజీ అహ్మదాబాద్ వస్త్ర కార్మికుల సంఘాన్ని స్థాపించి, 1918లో నిరాహార దీక్ష చేపట్టారు. చివరకు మిల్లు యాజమాన్యం కార్మికుల వేతనం 35 శాతం పెంచడానికి అంగీకరించింది.

**ఖేదా సత్యాగ్రహం:** గుజరాత్‌లోని ఖేదాలో 1918లో కరవు సంభవించింది. రెవెన్యూ కోడ్ ప్రకారం సాధారణ ఉత్పత్తిలో 1/4వ వంతు కంటే తక్కువైతే రైతులు భూమి శిస్తు నుంచి మినహాయింపునకు అర్హులు. అయితే అధికారులు పన్ను చెల్లించాల్సిందేనని పట్టుబట్టారు. గాంధీజీ సత్యాగ్రహం చేపట్టడంతో రైతులను భూమి శిస్తు చెల్లింపు నుంచి మినహాయించారు. ఈ సత్యాగ్రహం సందర్భంగా సర్దార్ పటేల్, ఇందూలాల్ యాజ్ఞిక్ లాంటి యువనాయకులు గాంధీజీకి అనుచరులుగా మారారు.

★ పై మూడు పోరాటాల్లో విజయం సాధించడం ద్వారా గాంధీజీ సామాన్య ప్రజల నమ్మకాన్ని, గౌరవాన్ని పొందగలిగారు. అలాగే వారి బలాలు, బలహీనతలను అర్థం చేసుకోగలిగారు.

## రౌలత్ చట్టం – 1919

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జాతీయవాదులు రాజ్యాంగపరమైన సంస్కరణల కోసం ఎదురు చూస్తున్న సమయంలో ప్రభుత్వం రౌలత్ చట్టాన్ని రూపొందించింది. దీన్ని వారు అవమానకరంగా భావించారు. విప్లవాత్మక నేరాల చట్టాన్ని ప్రభుత్వం 1919 ఫిబ్రవరిలో రూపొందించింది. ఈ చట్టాన్ని రూపొందించడానికి ఏర్పాటు చేసిన కమిటీకి సర్ సిడ్నీ రౌలత్ నాయకత్వం వహించడం వల్ల ఈ చట్టం రౌలత్ చట్టంగా ప్రసిద్ధి చెందింది. దీన్ని భారతీయులు నల్ల చట్టంగా పరిగణించి 1919 ఏప్రిల్ 6న దేశవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చారు.

**జలియన్‌వాలాబాగ్ దురంతం:** నిషేధ ఆజ్ఞల గురించి తెలియని సమీప గ్రామాల్లోని ప్రజలు 1919 ఏప్రిల్ 13 బైశాఖి పండగ రోజున సైపుద్దీన్ కిచ్లూ, డాక్టర్ సత్యపాల్‌ల అరెస్టుకు నిరసనగా అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్ (పార్కు)లో సమావేశమయ్యారు. జనరల్ డయ్యర్ పైశాచిక ప్రవర్తనవల్ల జరిగిన పోలీసు కాల్పుల్లో సుమారు 400 మంది మృతి చెందారు. దీనికి నిరసనగా రవీంద్రనాథ్ ఠాగూర్ నైట్‌హుడ్ బిరుదును త్యజించారు. హింసాత్మక పరిస్థితుల పట్ల అప్రమత్తమైన గాంధీజీ ఏప్రిల్ 18, 1919న ఉద్యమాన్ని ఉపసంహరించారు.

**సహాయ నిరాకరణ ఉద్యమం:** గాంధీజీ 1919 – 22 మధ్య ఖిలాఫత్, సహాయ నిరాకరణ ఉద్యమాల ద్వారా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారు. ఈ రెండు ఉద్యమాలు ప్రారంభించడానికి కారణాలు వేరైనా, అహింసాయుత సహాయ నిరాకరణ అనే ఉమ్మడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఖిలాఫత్ ఉద్యమానికి, భారత రాజకీయాలకు ప్రత్యక్ష సంబంధం లేకపోయినా సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించడానికి ఇదే తక్షణ కారణం కావడం విశేషం.

★ 1919 నవంబరులో ఢిల్లీలో జరిగిన అఖిల భారత ఖిలాఫత్ సమావేశంలో బ్రిటిష్ వస్తు బహిష్కరణకు పిలుపునిచ్చారు. గాంధీజీ ఖిలాఫత్ సమస్యపై సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ప్రారంభించాలని భావించినా, మతపరమైన సమస్యపై ముస్లిం నాయకులతో పొత్తుకలిగి ఉండటాన్ని తిలక్ తీవ్రంగా వ్యతిరేకించారు. చివరకు గాంధీజీ ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆమోదాన్ని పొందడంలో సఫలీకృతులయ్యారు. ఖిలాఫత్ ఉద్యమాన్ని బలపరుస్తూ గాంధీజీ 1920 ఆగస్టు 31న సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు.

★ కాంగ్రెస్ సెప్టెంబరు 1920లో కోల్‌కతాలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించడానికి అంగీకరించింది. 1920 డిసెంబరులో జరిగిన నాగ్‌పూర్ సమావేశంలో కాంగ్రెస్ ఈ ఉద్యమానికి ఆమోదముద్ర వేసింది. ఇదే సమావేశంలో కాంగ్రెస్ కొత్త రాజ్యాంగాన్ని ఆమోదించింది. స్వరాజ్య సాధనే తన లక్ష్యమని పునరుద్ఘాటించింది.

### ఉద్యమ లక్ష్యాలు, కార్యక్రమాలు

**లక్ష్యాలు:**

★ రౌలత్ చట్టాన్ని రద్దు చేసి, జలియన్ వాలాబాగ్ దురంతంపై బ్రిటిష్ ప్రభుత్వం విచారం వ్యక్తం చేయాలి.

★ బ్రిటిష్ ప్రభుత్వం టర్కీ పట్ల ఉదార వైఖరిని అవలంబించాలి. టర్కీ సుల్తానుకు ఖలీఫా పదవిని తిరిగి కట్టబెట్టాలి.

★ స్వరాజ్య డిమాండును అంగీకరించాలి.

**నకారాత్మక కార్యక్రమాలు:**

★ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన బిరుదులు, గౌరవ పదవులను భారతీయులు వెనక్కి ఇచ్చివేయాలి.

★ ప్రభుత్వ దర్బారుకు, అధికార ఉత్సవాలకు ఆహ్వానాలను తిరస్కరించాలి.

★ ప్రభుత్వ నియంత్రణలోని పాఠశాలలు, కళాశాలలను విద్యార్థులు బహిష్కరించాలి.

★ బ్రిటిష్ న్యాయస్థానాలను బహిష్కరించాలి.

★ మెసపటోమియాలో పనిచేయడానికి అన్నివర్గాల వారు తిరస్కరించాలి.

★ రాష్ట్ర, కేంద్ర శాసన సభలకు జరిగే ఎన్నికలను బహిష్కరించాలి.

★ విదేశీ వస్తువులను బహిష్కరించాలి.

★ స్థానిక సంస్థలలోని నామినేటెడ్ స్థానాలకు భారతీయులు రాజీనామా చేయాలి.

**సకారాత్మక కార్యక్రమాలు:**

★ ఆచార్య నరేంద్రదేవ్, చిత్తరంజన్ దాస్, లాలా లజపతిరాయ్, జాకీర్ హుస్సేన్, సుభాష్ చంద్రబోస్ లాంటి నాయకుల ఆధ్వర్యంలో జాతీయ విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి.

★ తిలక్ స్వరాజ్య నిధికి ఆరునెలలలోగా కోటి రూపాయలు విరాళంగా సేకరించారు.

★ స్వదేశీ పరిశ్రమల అభివృద్ధికి ప్రయత్నాలు జరిగాయి. 1921 జులైలో అలీ సోదరులు బ్రిటిష్ సైన్యం నుంచి ముస్లింలు వైదొలగాలని పిలుపునిచ్చారు.

★ హిందూ – ముస్లింల మధ్య సఖ్యతను పెంపొందించడం, స్త్రీల అభ్యున్నతికి కృషి చేయడం, అంటరానితనాన్ని నిర్మూలించడం.

★ దేశంలోని విశిష్ట వ్యక్తులు లాభదాయకమైన న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఖాదీ స్వాతంత్ర్యానికి చిహ్నంగా మారింది.

★ వేల్స్ యువరాజు పర్యటనను బహిష్కరించాలని నిర్ణయించారు. బొంబాయిలో నవంబరు 17, 1921న అతడి పర్యటనకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైతులు ప్రభుత్వానికి భూమి శిస్తు చెల్లించడం ఆపేశారు.

★ 1921 మే లో గాంధీజీ, వైస్రాయి లార్డ్ రీడింగ్ మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. 1922 ఫిబ్రవరి 1న గాంధీజీ బార్డోలి నుంచి శాసన ఉల్లంఘన ఉద్యమాన్ని ప్రారంభిస్తానని బ్రిటిష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**చౌరీచౌరా సంఘటన**

★ ఉద్యమం తారస్థాయికి చేరుకున్న సమయంలో 1922 ఫిబ్రవరి 5న ఉత్తర్ ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా చౌరీచౌరా గ్రామంలో ఒక సంఘటన చోటు చేసుకుంది. ఈ గ్రామం గోరఖ్‌పూర్ నుంచి 35 కి.మీ. దూరంలో ఉంది. ఈ గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న రైతులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. దీంతో కోపోద్రిక్తులైన ప్రజలు పోలీసులను స్టేషనులో బంధించి నిప్పు పెట్టారు. ఈ సంఘటనలో 22 మంది పోలీసులు సజీవదహనమయ్యారు. ఉద్యమం హింసాత్మకంగా మారడంతో గాంధీజీ ఉద్యమాన్ని నిలిపేశారు.

## ముఖ్యమైన ప్రశ్నలు

**1.** జలియన్ వాలాబాగ్ దురంతంపై విచారణ కోసం బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన కమిషన్ ఏది?

1) మెక్ డొనాల్డ్ కమిషన్ 2) సైమన్ కమిషన్ 3) బట్లర్ కమిషన్ 4) హంటర్ కమిషన్

**2.** తిలక్ మరణించినప్పుడు "నా బలమైన రక్షకుడు (bulwark) వెళ్లిపోయాడు" అన్న జాతీయ నాయకుడు ఎవరు?

1) షౌకత్ అలీ 2) మహమ్మద్ అలీ 3) గాంధీజీ 4) లాలా లజపతిరాయ్

**3.** అలీ సోదరులకు సంబంధమున్న ఉద్యమం / సంస్థ ఏది?

1) క్విట్ ఇండియా 2) ఖిలాఫత్ 3) శాసన ఉల్లంఘనం 4) కాంగ్రెస్

**4.** గాంధీజీని మొదటిసారిగా జాతిపితగా పిలిచింది ఎవరు?

1) తిలక్ 2) సరోజినీ దేవి 3) నెహ్రూ 4) సుభాష్ చంద్రబోస్

**5.** 1919లో అఖిల భారత ఖిలాఫత్ సమావేశం జరిగిన ప్రదేశం ఏది?

1) ఢిల్లీ 2) లఖ్‌నవూ 3) అలీగఢ్ 4) పోర్‌బందర్

**6.** రవీంద్రనాథ్ ఠాగూర్ నైట్‌హుడ్ (Kinghthood) బిరుదును త్యజించడానికి కారణం?

1) జలియన్ వాలాబాగ్ దురంతం 2) శాసనోల్లంఘన ఉద్యమం నిలిపివేత

3) భగత్ సింగ్‌ను ఉరితీయడం 4) చౌరీచౌరా సంఘటన

**7.** తిలక్ మరణించిన సంవత్సరం ఏది?

1) 1918 2) 1919 3) 1920 4) 1921

**8.** సురేంద్రనాథ్ బెనర్జీ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సంవత్సరం?

1) 1915 2) 1918 3) 1920 4) 1922

**9.** కృష్ణా పత్రిక సంపాదకుడు ఎవరు?

1) అజిత్‌సింగ్ 2) లాలా లజపతిరాయ్ 3) ముట్నూరి కృష్ణారావు 4) తిలక్

**10.** గాంధీజీని ప్రభావితం చేసిన లియో టాల్‌స్టాయ్ గ్రంథం ఏది?

1) కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ వితిన్ యు 2) అన్ టు దిస్ లాస్ట్

3) సివిల్ డిస్ఒబీడియన్స్ 4) యంగ్ ఇండియా

**11.** గాంధీ సబర్మతి ఆశ్రమాన్ని స్థాపించిన ప్రదేశం?

1) అలహాబాద్ 2) పోర్‌బందర్ 3) సూరత్ 4) అహ్మదాబాద్

**12.** అరాచకత్వ, విప్లవాత్మక నేరాల చట్టానికి మరోపేరు?

1) రౌలత్ చట్టం 2) పిట్స్ ఇండియా చట్టం 3) ఆయుధాల చట్టం 4) ఇల్బర్ట్ చట్టం

**13.** 1920లో కోల్‌కతాలో జరిగిన ఖిలాఫత్ సదస్సుకు అధ్యక్షత వహించింది ఎవరు?

1) ఎం.ఎ. అన్సారీ 2) మౌలానా అబుల్ కలామ్ 3) షౌకత్ అలీ 4) మహమ్మద్ అలీ

**14.** చౌరీచౌరా ఉత్తర్ ప్రదేశ్‌లోని ఏ జిల్లాలో ఉంది?

1) అలహాబాద్ 2) లఖ్‌నవూ 3) ఆగ్రా 4) గోరఖ్‌పూర్

**15.** జలియన్ వాలాబాగ్‌ను ఏర్పాటు చేసిన పండిత్ జల్లా ఎవరి ఆస్థానంలో ఉండేవారు?

1) మహారాజా రంజిత్‌సింగ్ 2) షాజహాన్ 3) అక్బర్ 4) షేర్షా

**16.** సహాయ నిరాకరణ ఉద్యమం సందర్భంగా గాంధీజీ 1921లో ఏ వైస్రాయితో జరిపిన చర్చలు విఫలమయ్యాయి?

1) చెమ్స్‌ఫర్డ్ 2) రీడింగ్ 3) ఇర్విన్ 4) డల్హౌసీ

**17.** కలకత్తా జాతీయ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వ్యక్తి ఎవరు?

1) తిలక్ 2) లాలా లజపతిరాయ్ 3) సుభాష్ చంద్రబోస్ 4) జాకీర్ హుస్సేన్

**జవాబులు**

**1–4; 2–3; 3–2; 4–4; 5–1; 6–1; 7–3; 8–2; 9–3; 10–1; 11–4; 12–1; 13–4; 14–4; 15–1; 16–2; 17–3.**

రచయిత : భాస్కర్ వేడియం

# జనరల్ స్టడీస్

## భారతదేశ చరిత్ర

### గాంధీ యుగం

భారతదేశంలోని స్వదేశీ పాలకులు, రాజకీయ పార్టీలు వ్యతిరేకించడంతో 1935 చట్టంలోని సమాఖ్య భాగం అమల్లోకి రాలేదు. దీంతో రాష్ట్రాలకు చెందిన అంశాలు మాత్రమే అమల్లోకి వచ్చాయి. దీని పర్యవసానంగా 1937 ఫిబ్రవరిలో రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగాయి.

**భారత ప్రభుత్వ చట్టం – 1935లోని ముఖ్యాంశాలను పరిశీలిద్దాం.**

★ రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించడం

★ అఖిల భారత సమాఖ్యను ఏర్పాటు చేయడం.

★ కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టడం.

★ మైనారిటీల రక్షణకు చర్యలు చేపట్టడం.

★ భారతదేశంపై బ్రిటిష్ పార్లమెంటుకు సార్వభౌమాధికారాన్ని కట్టబెట్టడం.

★ సమాఖ్య న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయడం.

★ శాసనసభల పరిమాణాన్ని పెంచడం.

★ ఓటు హక్కును విస్తరించడం, పరిపాలన విషయాలను మూడు జాబితాలుగా విభజించడం.

★ మతప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలను కొనసాగించడం, భారత కౌన్సిల్‌ను రద్దు చేయడం.

★ సలహా మండలిని ప్రవేశపెట్టడం.

★ బర్మాను భారతదేశం నుంచి వేరు చేయడం.

### భారతీయుల అసంతృప్తికి కారణమైన అంశాలు

★ ప్రాథమిక హక్కులకు స్థానం లేకపోవడం.

★ భారతదేశంపై బ్రిటిష్ పార్లమెంట్ సార్వభౌమాధికారం మరింత పెరగడం.

★ గవర్నర్లు, గవర్నర్ జనరల్‌కు విచక్షణాధికారాలు ఇవ్వడం.

★ మత ప్రాతిపదికన నియోజకవర్గాలను విస్తరించడం.

### కాంగ్రెస్ మంత్రిమండళ్ల ఏర్పాటు (1933 – 39)

1935 చట్టంలోని అనేక అంశాలను కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించింది. ఎన్నికల్లో గెలిచి శాసనసభల్లో ప్రవేశించి, ప్రభుత్వంతో విభేదించడం ద్వారా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి అమల్లోకి రాకుండా చూడాలనేది కాంగ్రెస్ లక్ష్యం. కాంగ్రెస్ పార్టీకి మద్రాసు, బిహార్, ఉత్తర్ ప్రదేశ్, బాంబే, సెంటర్ ప్రావిన్స్‌లు, ఒడిశాల్లో పూర్తి మెజారిటీ లభించింది. అస్సాంలో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో 50 స్థానాలకు 19 గెలుచుకుంది.

★ ముస్లింలీగ్ ఎన్నికల్లో పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయింది. రాష్ట్రాల అసెంబ్లీలలో ముస్లింలకు కేటాయించిన 482 స్థానాలకు 51 మాత్రమే గెలుచుకోగలిగింది. ముస్లిం పార్టీ రాష్ట్రాలైన పంజాబ్, బెంగాల్, వాయవ్య సరిహద్దు రాష్ట్రాల్లో కూడా ఎక్కువ స్థానాలు సాధించలేకపోయింది. పంజాబ్‌లో యూనియనిస్ట్ పార్టీ, బెంగాల్‌లో ప్రజాపార్టీ మంత్రిమండళ్లను ఏర్పాటు చేశాయి.

★ 1937 జులైలో కాంగ్రెస్ ఉత్తర్ ప్రదేశ్, బిహార్, మద్రాసు, బాంబే, ఒడిశా, సెంట్రల్ ప్రావిన్స్ రాష్ట్రాల్లో మంత్రిమండళ్లను ఏర్పాటు చేసింది. అస్సాం వాయవ్య సరిహద్దు రాష్ట్రాల్లో ఇతర రాజకీయ పక్షాల సహకారంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. సంపూర్ణ మెజారిటీ సాధించిన రాష్ట్రాల్లో ముస్లింలీగ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించడానికి కాంగ్రెస్ అంగీకరించలేదు. ఇది క్రమంగా హిందూ ముస్లింల మధ్య సఖ్యత దెబ్బతినడానికి కారణమైంది. ఇదే అదనుగా మహమ్మద్ అలీ జిన్నా కాంగ్రెస్‌పై అనేక ఆరోపణలు చేశాడు.



R-29-5-15

- ★ 1937లో 11 రాష్ట్రాల్లో మంత్రిమండళ్లు ఏర్పాటైనా, అవి సక్రమంగా పనిచేయలేదు. బెంగాల్, సింధ్, పంజాబ్‌లలో ఈ మంత్రి మండళ్లు పదేళ్లపాటు కొనసాగాయి. ఇతర రాష్ట్రాల్లో రెండేళ్లు మాత్రమే ఉన్నాయి.
- ★ రెండో ప్రపంచయుద్ధం ప్రారంభం కాగానే ఇంగ్లండ్, భారతదేశం కూడా యుద్ధంలో పాల్గొంటున్నట్లు ఏకపక్షంగా ప్రకటించింది. దీంతో 1939 అక్టోబరులో 8 రాష్ట్రాల్లోని కాంగ్రెస్ మంత్రిమండళ్లు రాజీనామా చేశాయి.

## మంత్రిమండళ్ల విజయాలు

తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో నిర్మాణాత్మక పనులను చేపట్టడంలో కాంగ్రెస్ ప్రత్యేక శ్రద్ధ చూపింది. అధికారంలోకి రాగానే ప్రాథమిక విద్య, పారిశ్రామిక వేతనాలు, కుటీర పరిశ్రమలు, హరిజనోద్ధరణ మొదలైన అంశాలపై దృష్టి సారించారు. వ్యవసాయదారులకు రుణబాధల నుంచి విముక్తి కల్పించారు. మద్యపాన నిషేధానికి ప్రయత్నించారు. కౌలుదారుల చట్టాలను రూపొందించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చారు. రాజకీయ ఖైదీలను విడిచిపెట్టి, స్వాధీనం చేసుకున్న ఆస్తులను తిరిగి ఇచ్చారు.

## ఆగస్టు కానుక (ఆఫర్)

కాంగ్రెస్ 1940 జులైలో భారతదేశ స్వాతంత్ర్య లక్ష్యానికి కట్టుబడి ఉండాలని ఇంగ్లండ్‌ను కోరింది. అలాగే కేంద్రంలో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. వైస్రాయ్ అనేక రాజకీయ పార్టీలతో మంతనాలు జరిపి 1940 ఆగస్టు 8న సిమ్లాలో ఒక ప్రకటన జారీ చేశాడు. దీన్నే ఆగస్టు కానుక అంటారు.

**ప్రధాన అంశాలు:**

- ★ వైస్రాయ్ పాలక మండలిలో ఎక్కువ మంది భారతీయులకు స్థానం కల్పించడం ద్వారా దాన్ని విస్తరించడం.
- ★ బ్రిటిష్ ఇండియా, స్వదేశీ రాజ్యాల ప్రతినిధులతో కూడిన యుద్ధ సలహా మండలిని ఏర్పాటు చేయడం.
- ★ జాతీయవాదులు ఆగస్టు కానుకను వ్యతిరేకించారు. అయినా బ్రిటిష్ ప్రభుత్వం దీన్ని అమలు చేయడానికి నిర్ణయించింది. దానికి అనుగుణంగా వైస్రాయ్ పాలక మండలిలో సభ్యుల సంఖ్యను 7 నుంచి 12 కు పెంచారు. వీరిలో నలుగురు బ్రిటిష్ వారు, 8 మంది భారతీయులు. అయితే కాంగ్రెస్, ముస్లింలీగ్‌కు చెందిన వారెవరూ ఈ కొత్త పాలక మండలిలో చేరలేదు.

## క్రిప్స్ రాయబారం (1942)

బ్రిటిష్ యుద్ధ మంత్రిమండలిలో సభ్యుడైన సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ను రాయబారిగా పంపడం ద్వారా భారతదేశంలో రాజకీయ అనిశ్చితికి తెరదించాలని బ్రిటిష్ ప్రభుత్వం భావించింది.

- ★ భారతీయులు ప్రత్యేక రాజ్యాంగాన్ని రూపొందించుకోవడానికి క్రిప్స్ అంగీకరించాడు. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహించారు. స్వదేశీ రాజ్యాల ప్రతినిధులతో పాటు ఎన్నికైనవారు ఒక ఎలక్టోరల్ కాలేజీగా ఏర్పడి రాజ్యాంగ పరిషత్ సభ్యులను ఎన్నుకుంటారు. ఏదైనా రాష్ట్రానికి కొత్తగా రూపొందించే రాజ్యాంగం ఆమోదయోగ్యం కాకపోతే ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరకుండా ప్రత్యేక రాజ్యాంగాన్ని రూపొందించుకోవచ్చు. అయితే కాంగ్రెస్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ సూత్రాన్ని అమలుచేస్తే ప్రత్యేక పాకిస్థాన్‌కు ఆమోదం తెలిపినట్లే అని కాంగ్రెస్ వాదించింది. క్రిప్స్ ప్రతిపాదనలను ముస్లింలీగ్ స్వాగతిస్తే, మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి.

## క్విట్ ఇండియా ఉద్యమం

**క్విట్ ఇండియా ఉద్యమం లేదా 1942 తిరుగుబాటుకు దారి తీసిన కారణాలు:**

- ★ ఆగ్నేయ ఆసియాలో జపాన్ చేతిలో ఇంగ్లండ్ ఓటమి.
- ★ యుద్ధం కారణంగా ద్రవ్యోల్బణం పెరగడం – ఆహార పదార్థాల కొరత.
- ★ క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించడానికి ముందు బ్రిటిష్ వారి రెచ్చగొట్టే ధోరణి, ఆమోదించిన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన అణచివేత కార్యక్రమాలు.
- ★ 1942 ఆగస్టు 8న బొంబాయిలో సమావేశమైన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించింది. ఆ రోజు రాత్రే గాంధీజీ 'చేయండి లేదా మరణించండి' (డూ ఆర్ డై) అనే నినాదాన్ని ఇచ్చారు.
- ★ కాంగ్రెస్ ఉద్యమాన్ని ప్రారంభించేలోపు 1942 ఆగస్టు 9న గాంధీజీతో సహా ముఖ్యనాయకులను అరెస్టు చేసి నిర్బంధించారు. దీంతో దేశవ్యాప్తంగా హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి.

★ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలను ప్రభుత్వం నిషేధించింది. మొదటి దశలో ఆగస్టు 8 నుంచి 13 వరకు నాలుగు రోజుల కాలాన్ని గొప్ప ఆగస్టు తిరుగుబాటుగా పేర్కొన్నారు. రెండోదశ సెప్టెంబరు చివరి వరకు కొనసాగింది. ఈ కాలంలో బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్, బిహార్‌లోని అనేక ప్రాంతాల్లో జాతీయ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. మొదటి సమాంతర ప్రభుత్వం చిట్టీ పాండే నాయకత్వంలో బల్లియాలో ఏర్పాటైంది. 1942 సెప్టెంబరు తర్వాతి కాలాన్ని మూడో దశగా పేర్కొంటారు. ఈ కాలంలో ఉద్యమానికి మధ్యస్థాయి కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ సోషలిస్టులు నాయకత్వం వహించారు. వారిలో ముఖ్యులు అచ్యుత్ పట్వర్ధన్, రామ్ మనోహర్ లోహియా, అరుణా అసఫ్ ఆలీ, జయప్రకాశ్ నారాయణ్.

- **సి.ఆర్.ఫార్ములా:** కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజీ కుదర్చడానికి 1944లో సి.రాజగోపాలాచారి ఒక ప్రతిపాదన చేశారు. దీన్నే సి.ఆర్.ఫార్ములా అంటారు.
- **గాంధీజీ – జిన్నా చర్చలు:** సి.ఆర్.ఫార్ములా ఆధారంగా బొంబాయిలో గాంధీజీ, మహమ్మద్ అలీ జిన్నా మధ్య 1944 సెప్టెంబరు 9 నుంచి 27 వరకు చర్చలు జరిగాయి. గాంధీజీ హిందువులు, ముస్లింలు రెండు స్వతంత్ర దేశాలనే విషయాన్ని గుర్తించాలని మహమ్మద్ అలీ జిన్నా మొండిగా వాదించారు. దీంతో ఈ చర్చలు విఫలమయ్యాయి.
- **దేశాయ్ – లియాఖత్ ఒప్పందం (1945):** 1945లో కాంగ్రెస్ నాయకుడు భులాభాయ్ దేశాయ్, ముస్లింలీగ్ నాయకుడు లియాఖత్ ఆలీఖాన్ మధ్య ఒక ఒప్పందం జరిగింది. అయితే ఈ ఒప్పందాన్ని కాంగ్రెస్, ముస్లింలీగ్ రెండూ ఆమోదించలేదు.

## ముఖ్యమైన ప్రశ్నలు

**1.** 1946 లో ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వంలో రక్షణశాఖ మంత్రి ఎవరు?
ఎ) జాన్ మత్తయ్ బి) బలదేవ్‌సింగ్ సి) రాజగోపాలాచారి డి) రాజేంద్రప్రసాద్

**2.** ఏఐసీసీ కోశాధికారిగా చాలా సంవత్సరాలు పనిచేసి, 1930లో జైలుకు వెళ్లిన పెట్టుబడిదారుడు?
ఎ) జి.డి.బిర్లా బి) జె.ఆర్.డి.టాటా సి) జమ్నాలాల్ బజాజ్ డి) హీరాచంద్

**3.** దీపావళి ప్రకటన చేసిన వైస్రాయ్?
ఎ) లిన్‌లిత్‌గో బి) రిప్పన్ సి) వెల్లింగ్టన్ డి) ఇర్విన్

**4.** 'రక్షణ కోసం అడిగే ముస్లింలు తెలివితక్కువవారు. వాటిని నిరాకరించే హిందువులు మరీ తెలివి తక్కువవారు' అని పేర్కొన్న వ్యక్తి?
ఎ) జవహర్‌లాల్ నెహ్రూ బి) అబుల్ కలాం ఆజాద్ సి) మహమ్మద్ ఆలీ డి) సుభాష్ చంద్రబోస్

**5.** జవహర్‌లాల్ నెహ్రూ కోరిక మేరకు ఏ కాంగ్రెస్ సమావేశంలో మొదటిసారిగా స్వాతంత్ర్య తీర్మానాన్ని ఆమోదించారు?
ఎ) మద్రాసు – 1927 బి) కలకత్తా – 1928 సి) లాహోర్ – 1929 డి) కరాచీ – 1931

**6.** 1937లో కాంగ్రెస్ మంత్రిమండళ్లు ఏర్పాటైనప్పటి వైస్రాయ్?
ఎ) లిన్‌లిత్‌గో బి) రీడింగ్ సి) ఇర్విన్ డి) వేవెల్

**7.** సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేసినప్పుడు భారత వైస్రాయ్?
ఎ) రీడింగ్ బి) వెల్లింగ్టన్ సి) ఇర్విన్ డి) లిన్‌లిత్‌గో

**8.** స్వాతంత్ర్యోద్యమ కాలంలో అతిపిన్న వయసులో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి?
ఎ) అబుల్ కలామ్ ఆజాద్ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) సరోజినీ నాయుడు డి) ఎం.ఎ.అన్సారీ

**9.** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడు?
ఎ) జె.బి.కృపలానీ బి) రాజేంద్రప్రసాద్ సి) లాలాలజపతిరాయ్ డి) జవహర్‌లాల్ నెహ్రూ

**10.** హిందూ మహాసభను ఏర్పాటు చేసిన సంవత్సరం?
ఎ) 1918 బి) 1917 సి) 1916 డి) 1915

**11.** 1925 మార్చిలో కేంద్ర శాసనసభ స్పీకర్‌గా స్వరాజ్యపార్టీ ఎవరిని ఎన్నుకుంది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) ఎం.ఎ.అన్సారీ సి) చిత్తరంజన్‌దాస్ డి) విఠల్‌భాయ్ పటేల్

**12.** భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించిన సంవత్సరం?

ఎ) 1920 బి) 1923 సి) 1925 డి) 1926

**13.** ప్రసిద్ధి చెందిన బార్డోలి సత్యాగ్రహానికి నాయకత్వం వహించిన వ్యక్తి?

ఎ) గాంధీజీ బి) రాజేంద్రప్రసాద్ సి) సర్దార్ వల్లభాయ్ పటేల్ డి) జవహర్‌లాల్ నెహ్రూ

**14.** వీరోచిత స్వాతంత్ర్య పోరాటయోధురాలు రాణిగైడిన్‌లూ ఏ రాష్ట్రానికి చెందినవారు?

ఎ) బెంగాల్ బి) అస్సాం సి) నాగాలాండ్ డి) మేఘాలయ

**15.** టాటా ఐరన్ అండ్ స్టీల్ వర్క్స్‌లో జరిగిన సమ్మెను పరిష్కరించిన వ్యక్తి?

ఎ) గాంధీజీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) రాజేంద్రప్రసాద్ డి) సుభాష్ చంద్రబోస్

**16.** 1939లో సుభాష్ చంద్రబోస్ స్థాపించిన పార్టీ ఏది?

ఎ) కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ బి) స్వరాజ్య పార్టీ సి) ఫార్వర్డ్ బ్లాక్ డి) లిబరల్ పార్టీ

**జవాబులు**

1-బి; 2-ఎ; 3-ఎ; 4-సి; 5-ఎ; 6-ఎ; 7-సి; 8-ఎ; 9-ఎ; 10-బి; 11-డి; 12-సి; 13-సి; 14-సి; 15-డి; 16-సి.

**రచయిత: భాస్కర్ వేడియం**

www.eenadupratibha.net
www.eenadupratibha.net